

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

మంగళవారం 24-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :155 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్



బీఆర్ఎస్‌కు అధికారం కలే: భట్టి కౌంటర్!

- కేటీఆర్ వ్యాఖ్యలకు భట్టి కౌంటర్
- బీఆర్ఎస్‌కు అధికారం కలేనని వ్యాఖ్య
- రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా
- బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై విమర్శలు
- సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు
- 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ
- కాంగ్రెస్‌లో విభేదాల ప్రచారంపై ఖండన
- బీజేపీపై భట్టి తీవ్ర విమర్శలు


2 లో

న్యూస్ డెస్క్, 23 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని, 500 రోజుల తర్వాత కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కౌంటర్ ఇచ్చారు. కేటీఆర్ ఊహా ప్రపంచంలో బతుకుతూ, సోషల్ మీడియాకే పరిమితమయ్యారని విమర్శించారు. అందుకే కాంగ్రెస్‌పై సోషల్ మీడియాలో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలకు సంక్షేమం అందిస్తూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంటే బీఆర్ఎస్ నేతలు అనవసర విమర్శలు చేస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. బీఆర్ఎస్‌కు అధికారం ఇక కలేనని స్పష్టం చేశారు. సోమవారం గాంధీ భవన్ లో ఏఐసీసీ నూతన ఇన్ చార్జి బీఎం సందీప్ ను మర్యాదపూర్వకంగా కలిసిన

కృష్ణా జలాలపై చంద్రబాబుకు కవిత విజ్ఞప్తి!

- కృష్ణా జలాల వివాదంపై కవిత కీలక వ్యాఖ్యలు
- చంద్రబాబు అన్నదమ్ముల్లా వ్యవహరించాలని విజ్ఞప్తి
- నీటి తరలింపుపై తెలంగాణలో ఆందోళన
2 లో
- ఏపీ నాయకుల కంటే రేవంత్ వైఖరిపైనే ప్రశ్నలు
- అపెక్స్ కౌన్సిల్‌లో నీటి పంపకాలపై చర్చించాలని సూచన
- ఇరు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలు కాపాడాలని పిలుపు
- సామరస్యంగా సమస్య పరిష్కరించుకోవాలని కవిత సూచన

హైదరాబాద్ ఉగ్రదాడి బెదిరింపు మెయిల్ ఫేక్!

- బెదిరింపు మెయిల్‌తో హైదరాబాద్‌లో కలకలం
- 26/11 తరహా దాడులు చేస్తామంటూ హెచ్చరిక
- కాచిగూడ రైల్వే స్టేషన్, టూరిస్ట్ ప్లాజాకు ముప్పు
- 300 మందిని చంపడమే లక్ష్యమంటూ మెయిల్
- ఫేక్ మెయిల్‌గా నిర్ధారించిన నగర పోలీసులు
- యాంటీ సబోటేజ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు
2 లో
- మెయిల్ పంపిన వారి కోసం సైబర్ క్రైమ్ గాలింపు
- అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే 112కు సమాచారం

సెక్రెటేరియట్ బాహుబలి దర్వాజలకు పగుళ్లు


2 లో

న్యూస్ డెస్క్, 23 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ సెక్రెటేరియట్‌కు ప్రధాన ఆకర్షణగా ఉండే బాహుబలి దర్వాజలకు పగుళ్లు పడుతున్నాయి. ఒక్కో దర్వాజకు రెండు మూడు చోట్ల పగుళ్లు కనిపిస్తున్నాయి.దర్వాజలు అందంగా కనిపించేందుకు వాటిపై ఏర్పాటు చేసిన బంగారపు రంగు పూసిన ఇత్తడి నగిషీలు సైతం కొన్ని చోట్ల ఊడిపోతున్నాయి.



కృష్ణా జలాలపై ముళ్లే మంట్లు!

- 10 టీఎంసీల అదనపు నీటికి ఏపీ డిమాండ్
- మూడు నెలల తాగునీటి కోసం ఏపీ ప్రతిపాదన
- ఏపీ డిమాండ్‌పై తెలంగాణ తీవ్ర అభ్యంతరం
- కేటాయింపులకు మించి నీటిని వాడుకున్న ఏపీ
- అదనపు నీటికి చుక్క కూడా ఇచ్చేది లేదన్న తెలంగాణ
- తెలంగాణకు 30 టీఎంసీల నీటి కేటాయింపు కోరిన అధికారులు
- వాదనలు.. ప్రతివాదాలతో కేఆర్ఎంబీ సమావేశం హాట్
- ఎలాంటి నిర్ణయం లేకుండానే వాయిదా పడిన భేటీ

న్యూస్ డెస్క్, 23 నవంబర్ (ఇది కద నిజం): కృష్ణా జలాల పంపిణీ అంశంపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య మరోసారి వివాదం రాజుకుంది. తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుంచి అదనంగా 10 టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరగా.. ఇప్పటికే అధికంగా నీటిని వినియోగించుకున్నారని తెలంగాణ సర్కార్ తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ అదనంగా కోరిన నీటిలో ఒక్క చుక్క కూడా ఇచ్చేందుకు అంగీకరించబోమని స్పష్టం చేసింది.

మిగతాది 2 లో..

2028లో గులాబీ జెండా ఎగరడం ఖాయం!

- 2028లో కేసీఆర్ మళ్లీ సీఎం
- రేవంత్ పాలనపై కేటీఆర్ ఫైర్
- కాంగ్రెస్ పాలనలో అవినీతి పెరిగిందంటూ విమర్శ
- వరంగల్ అభివృద్ధి బీఆర్ఎస్ ఘనత
- ఐటీ కంపెనీలు తెచ్చింది తమ ప్రభుత్వమే
- కేసీఆర్‌పై కాంగ్రెస్ విమర్శలకు కేటీఆర్ కౌంటర్
- పెన్షన్ల తగ్గింపుపై కాంగ్రెస్‌కు ప్రశ్న
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలని పిలుపు


2 లో

న్యూస్ డెస్క్, 23 నవంబర్ (ఇది కద నిజం): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డివి తుగ్లక్ ఆలోచనలని, ఆయన పాలనలో అవినీతి విజృంభించడం తప్ప అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. వరంగల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న ఆయన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై నిప్పులు చెరిగారు. చెప్పిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి మళ్లీ పాత రోజులను తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు.

పంబలో చెత్త వేస్తే రూ.5 వేల జరిమానా!



- పంబ నదిలో కాలుష్యానికి రూ.5 వేల జరిమానా
- చెత్త, వాడిన వస్త్రాలు వేస్తే కఠిన చర్యలు
2 లో
- రెండు నెలల పాటు కొత్త నిబంధనలు అమలు
- ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసుల హెచ్చరిక
- తనిఖీలు, జరిమానాలకు అధికారులకు ప్రత్యేక బాధ్యతలు
- భక్తులు, స్థానికుల తాగునీటి రక్షణకు చర్యలు
- జరిమానాల సొమ్ము పారిశుద్ధ్య పనులకే వినియోగం

భారత్ పేదరికంపై గెలిచిన దశాబ్దం!

- పేదరికంపై భారత్ చారిత్రాత్మక విజయం
- పదేళ్లలో 50 కోట్ల మందికి విముక్తి
- మోదీ పాలనలో సమగ్ర అభివృద్ధి
- స్వచ్ఛ భారత్‌తో శిశు మరణాల తగ్గింపు
- 16 కోట్ల ఇళ్లకు నల్లా కనెక్షన్లు
- ముద్రా రుణాలతో మహిళలకు ప్రోత్సాహం
- 3.7 కోట్ల మంది లఖ్‌పతి దీదీలు
- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం


2 లో

న్యూస్ డెస్క్, 23 నవంబర్ (ఇది కద నిజం): ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని గత పదేళ్ల పాలనలో భారత్ పేదరిక నిర్మూలనలో చారిత్రాత్మక విజయం సాధించిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. సోమవారం లింక్డ్‌ఇన్ వేదికగా "పేదరికంపై భారత్ గెలుపు సాధించిన దశాబ్దం" అనే శీర్షికతో ఆమె ఒక ప్రత్యేక వ్యాసాన్ని పోస్ట్ చేశారు.

బిస్లరీ నీరు సురక్షితమే కంపెనీ ప్రకటన!



2 లో

- 14 నెలల క్రితం నాటి గోవా ప్లాంట్ బ్యాచ్
- ఆరు నమూనాల్లో ఐదింటికి క్లీన్ చిట్
- ఒక నమూనాలో బ్రోమేట్ స్థాయిపై వివాదం
- స్వతంత్ర ల్యాబ్ పరీక్షల్లో పరిమితిలోనే బ్రోమేట్
- ఎఫ్ఎస్ఎస్ఏఐ నోటీసులు అందలేదన్న కంపెనీ
- 90కి పైగా నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడి
- బిస్లరీ నీరు పూర్తిగా సురక్షితమంటూ భరోసా

రాహుల్ కోసం తెలంగాణ నిధులా?

- కాంగ్రెస్‌పై నితిన్ నబీన్ విమర్శలు
- కరీంనగర్‌లో మహాపాదయాత్ర
- ఎస్ఐఆర్‌పై రాహుల్‌కు కౌంటర్
- ఓటర్ల జాబితాపై ప్రశ్నలు
- విదేశాల్లో భారత్‌పై విమర్శలంటూ ఫైర్
- రేవంత్‌పై ఏటీఎం ఆరోపణలు
- తెలంగాణలో బీజేపీదే అధికారమని ధీమా


2 లో

న్యూస్ డెస్క్, 23 నవంబర్ (ఇది కద నిజం): కాంగ్రెస్ పార్టీకి దేశ ప్రయోజనాల కంటే రాజకీయాలు, ఒకే కుటుంబం యొక్క అభ్యున్నతే ముఖ్యమని నితిన్ నబీన్ ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన బీజేపీ మహాపాదయాత్ర సభలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనను ప్రశంసిస్తూనే, కాంగ్రెస్ పార్టీపై, రాహుల్ గాంధీపై, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై పలు విమర్శలు చేశారు.

కరీంనగర్ ప్రజలకు, శ్రేణులకు అభివాదం

కరీంనగర్ మహాపాదయాత్రకు కంటికి కనిపించినంత దూరం ప్రజలు ప్రభంజనంలా తరలివచ్చారని నితిన్ నబీన్ అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు, తల్లులకు, యువతకు, పార్టీ కార్యకర్తలకు ఆయన ప్రత్యేక అభివాదం తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుల సమర్థవంతమైన నాయకత్వం, కార్యకర్తల కృషి వల్లే ఈ జనసందోహం సాధ్యమైందని ఆయన అభినందించారు. విపక్షాలు తమ సర్వశక్తులూ ఒడ్డినా ఒక్క రామ్‌లీలా మైదానాన్ని నింపలేకపోయాయని, కానీ బీజేపీ కార్యకర్తలు దేశవ్యాప్తంగా 200కు పైగా ప్రాంతాల్లో దానికి పదిరెట్ల జనాన్ని సమీకరించారని ఆయన అన్నారు.

చనిపోయిన వారి ఓట్లు తొలగించాలా.. వద్దా?

ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై నితిన్ నబీన్ స్పందిస్తూ, ప్రజల మద్దతు, అసలైన ఓట్లు తమ పక్షానే ఉన్నాయని అన్నారు.

నిరూపిస్తే రాజకీయాలకే గుడ్‌బై!

- కేటీఆర్‌కు నాయిని రాజేందర్ రెడ్డి సవాల్
- వరంగల్ నుంచి పోటీ చేయాలంటూ ఛాలెంజ్
- కాళోజీ కళాక్షేత్రాన్ని కాంగ్రెస్ పూర్తి చేసిందన్న నాయిని
- నిరూపించకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా
- రాజకీయాల నుంచి తప్పుకుంటానంటూ సంచలన ప్రకటన
- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిపై బీఆర్ఎస్‌కు విమర్శలు
- రూ.550 కోట్లతో వరంగల్ అభివృద్ధి
- కేటీఆర్‌తో బహిరంగ చర్చకు సిద్ధమని వెల్లడి
2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 24-11-2026

నిరూపిస్తే రాజకీయాలకే గుడ్‌బై!



న్యూస్ డెస్క్, 23 నవంబర్ (ఇది కద నిజం): వరంగల్ అభివృద్ధి విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హన్మకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి కేటీఆర్‌కు బహిరంగ సవాల్ విసిరారు. దమ్ముంటే వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి తనపై గెలవాలని నాయిని ఛాలెంజ్ చేశారు. గత బీఆర్ఎస్ పాలకులు కాళోజీ కళాక్షేత్రం నిర్మాణాన్ని మధ్యలోనే వదిలేస్తే, తాము అధికారంలోకి వచ్చాకే దానిని పూర్తి చేశామని నాయిని స్పష్టం చేశారు. కాళోజీ కళాక్షేత్రాన్ని నిర్మించింది బీఆర్ఎస్ సర్కారే అని చెప్పుకోవడం ఏమాత్రం సరికాదన్నారు. తాను 'చెబుతున్నది అబద్ధమని నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడమే కాకుండా, శాశ్వతంగా రాజకీయాల నుంచే తప్పుకుంటానని ఆయన సంచలన ప్రకటన చేశారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని గాలికొదిలేశారు..

వరంగల్ ప్రజలకు ఎంతో కీలకమైన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మధ్యలోనే నిలిపివేసిందని నాయిని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.550 కోట్ల నిధులతో వరంగల్ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. వరంగల్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాను ఎప్పుడైనా సిద్ధమేనని నాయిని ప్రకటించారు. 'కాంగ్రెస్ హయాంలో మేమేం చేశామో నేను లెక్కలతో సహా చెబుతాను.. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో ఏం చేశారో కేటీఆర్ చెప్పాలి. నాతో చర్చలకు కేటీఆర్ సిద్ధమా?' అంటూ ఆయన ప్రశ్నించారు.

బిస్లరీ నీరు సురక్షితమే: కంపెనీ ప్రకటన!

న్యూస్ డెస్క్, 23 నవంబర్ (ఇది కద నిజం): ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ నమూనాలు భద్రతా పరీక్షల్లో విఫలమయ్యాయంటూ భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (FSSAI) విచారణకు అనుమతి చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వివాదంపై 'బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్' సోమవారం అధికారికంగా స్పందించింది. మీడియాలో వస్తున్న కథనాలపై స్పష్టత నిస్తూ, ఇది సుమారు 14 నెలల క్రితం నాటి పాత వ్యవహారమని, బిస్లరీ నీరు ఎప్పటిలాగే తాగడానికి పూర్తిగా సురక్షితమని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది.

14 నెలల క్రితం నాటి గోవా ప్లాంట్ బ్యాచ్

దేశవ్యాప్తంగా ఉన్న తమ 143 ప్లాంట్లలో ఒకటైన గోవా తయారీ కేంద్రంలో సెప్టెంబర్ 2025లో ఉత్పత్తి అయిన ఒక బ్యాచ్‌కు సంబంధించిన అంశమిదని బిస్లరీ తెలిపింది. 2025 సెప్టెంబర్ 30న ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు గోవా ప్లాంట్ నుంచి 6 నమూనాలను సేకరించగా, వాటిలో ఐదు నమూనాలు అన్ని ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని పేర్కొంది. ఆరో నమూనాలో మాత్రమే నిర్దేశిత పరిమితి (లీటరుకు 10 మైక్రోగ్రాములు) కంటే కాస్త ఎక్కువగా, అంటే లీటరుకు 12 మైక్రోగ్రాముల బ్రోమేట్ ఉన్నట్లు ప్రాథమిక పరీక్షల్లో తేలిందని వివరించింది.

దీనిపై తాము 2025 నవంబర్ 22న అప్పీల్ చేయడంతో, ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆ నమూనాను రిఫరల్ ల్యాబొరేటరీకి పంపిందని బిస్లరీ తెలిపింది. అక్కడ జరిగిన పరీక్షల్లో బ్రోమేట్ స్థాయి నిర్దేశిత పరిమితిలోనే ఉన్నట్లు తేలిందని, అయితే పాలీ న్యూక్లియర్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్ ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపింది. రెండు పరీక్షల ఫలితాల మధ్య వ్యత్యాసం ఉండటంతో, ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆమోదం పొందిన మరో స్వతంత్ర ల్యాబ్‌లో తాము ఆ నమూనాను పరీక్షించగా, అందులోనూ బ్రోమేట్ పరిమితికి లోబడే ఉన్నట్లు స్పష్టమైందని కంపెనీ వెల్లడించింది.

ఇప్పటివరకు ఎలాంటి నోటీసులు అందలేదు

స్వతంత్ర ల్యాబ్ పరీక్షా ఫలితాలను జతచేస్తూ 2026 ఫిబ్రవరి 2న ఎఫ్ఎస్ఎస్ఏఐ వెస్టర్న్ రీజినల్ కార్యాలయానికి అధికారిక లేఖ సమర్పించామని, ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో ఆ వ్యవహారం ముగిసిపోయిందని తాము భావించామని బిస్లరీ పేర్కొంది. ఇప్పటివరకు తమకు ఈ-మెయిల్ ద్వారా గానీ, హార్డ్ కాపీ రూపంలో గానీ ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఎలాంటి నోటీసు అందలేదని, కనీసం వారి వెబ్‌సైట్‌లోనూ ఆ నోటీసు కనిపించడం లేదని స్పష్టం చేసింది.

90కి పైగా నాణ్యతా పరీక్షలు - పూర్తి సురక్షితం

అలాగే తాగునీటి భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, 10 దశల తయారీ ప్రక్రియలో 90కి పైగా కఠినమైన నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తామని బిస్లరీ తెలిపింది. నిబంధనల ప్రకారం ఎఫ్ఎస్ఎస్ఏఐకి పూర్తిగా సహకరిస్తామని, ఏళ్ల తరబడి ప్రజల నమ్మకాన్ని చూరగొన్న బిస్లరీ నీరు తాగడానికి పూర్తిగా సురక్షితమని కంపెనీ భరోసా ఇచ్చింది.

2028లో గులాబీ జెండా ఎగరడం ఖాయం!

మొదటి పేజీ తరువాయి

రాబోయే 2028 ఎన్నికల్లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమని, ప్రజలు నాటి బీఆర్ఎస్ పరిపాలనను ఒకసారి గుర్తుచేసుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

వరంగల్ నగర అభివృద్ధికి బీఆర్ఎస్ హయాంలోనే బలమైన పునాదులు పడ్డాయని, తమ ప్రభుత్వ కృషి వల్లే వరంగల్‌కు ఐటీ కంపెనీలు తరలివచ్చాయని కేటీఆర్ గుర్తు చేశారు. మిషన్ భగీరథ తాగునీటి పథకాన్ని ఇక్కడే బ్రహ్మాండంగా అమలు చేశామని, అవుటర్ రింగ్ రోడ్డు పనులను కూడా ఒక కీలక దశ వరకు తీసుకెళ్లామని వివరించారు. అయితే, కాంగ్రెస్ నేతలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నిత్యం కేసీఆర్‌ను బూతులు తిట్టడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ ఎలాంటి అబద్ధపు హామీలు ఇవ్వలేదని, కానీ రేవంత్‌రెడ్డి మాత్రం కోటి మందిని కోటీశ్వరులను చేస్తానని గొప్పలు చెప్పారని, అసలు లక్ష మందినైనా లక్షాధికారులను చేసే దమ్ము ఆయనకు ఉందా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి తీరుపై మంత్రి కొండా సురేఖ కుమార్తె గతంలో ఏం మాట్లాడారో ప్రజలు ఒక్కసారి గుర్తుచేసుకోవాలని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

సంక్షేమ పథకాల అమలులోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో 4 లక్షల 71 వేల పాత పెన్షన్లను తొలగించి, ఇప్పుడు 4 లక్షల 63 వేల మందికి కొత్త పెన్షన్లు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలకు సిగ్గుందా అని నిలదీశారు. ఇది పెన్షన్లు పెంచడమా లేక తగ్గించడమా అని ప్రశ్నించారు. రాబోయే కార్పొరేషన్, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలని, ఎవరికి ఓటేస్తే తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందో బేరీజు వేసుకుని తీర్పు ఇవ్వాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

పంబలో చెత్త వేస్తే రూ.5 వేల జరిమానా!

న్యూస్ డెస్క్, 23 నవంబర్ (ఇది కద నిజం): మండల-మకరవిళక్కు యాత్రా సీజన్ (2026-27) నేపథ్యంలో పవిత్ర పంబ నదిలో కాలుష్యాన్ని అరికట్టేందుకు కేరళ యంత్రాంగం కఠిన నిర్ణయం తీసుకుంది. నదిలో వాడిన వస్త్రాలు, ప్లాస్టిక్ లేదా ఇతర చెత్త వేసే భక్తులకు అక్కడికక్కడే రూ. 5,000 వరకు జరిమానా విధించనున్నట్లు శబరిమల అదనపు జిల్లా మేజిస్ట్రేట్ దిలీప్ కె. కైనిక్కర నవంబర్ 22న జారీ చేసిన నిషేధాజ్ఞల్లో స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం పంబ నది, దాని ఉపనదులు, స్నాన ఘట్టాలు, బహిరంగ ప్రదేశాల్లో బట్టలు, వ్యక్తిగత వస్తువులు లేదా ఘన వ్యర్థాలు వదిలివెళ్లడం పూర్తిగా నిషిద్ధం. తక్షణమే అమల్లోకి వచ్చిన ఈ నిబంధనలు రెండు నెలల పాటు కొనసాగుతాయని, ఉల్లంఘించిన వారిపై భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, కేరళ పంచాయతీ రాజ్ చట్టాల కింద జరిమానాలు విధిస్తామని తెలిపారు.

ఈ నిబంధనల అమలు కోసం పంబ డ్యూటీ మేజిస్ట్రేట్, పోలీస్ స్పెషల్ ఆఫీసర్, రన్ని-పెరునాడ్ గ్రామ పంచాయతీ కార్యదర్శికి తనిఖీలు చేసి జరిమానాలు వసూలు చేసే అధికారాలు కల్పించారు. జరిమానా విధించిన 15 రోజుల్లోగా చెల్లించకపోతే భారతీయ న్యాయ సంహిత, నీటి కాలుష్య నివారణ చట్టం కింద క్రిమినల్ కేసులు నమోదు చేసి ప్రాసిక్యూషన్ చర్యలు చేపడతామని హెచ్చరించారు. లక్షలాది మంది భక్తులు, స్థానికులకు పంబ నదే ప్రధాన తాగునీటి వనరు కావడంతో, నది కలుషితమై అంటువ్యాధులు ప్రబలకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు వివరించారు. ఇందుకోసం ట్రావెన్‌కోర్ దేవస్వోమ్ బోర్డు సహకారంతో తెలుగు సహా వివిధ భాషల్లో అవగాహన కల్పిస్తుండగా, జరిమానాల ద్వారా వచ్చిన మొత్తాన్ని పంబ, శబరిమల ప్రాంతాల పారిశుద్ధ్య పనులకే వినియోగించనున్నారు.

భారత్ పేదరికంపై గెలిచిన దశాబ్దం!

మొదటి పేజీ తరువాయి

2011 నుంచి 2023 మధ్య కాలంలో భారత్‌లో దాదాపు 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని, తీవ్ర పేదరికం దాదాపుగా అంతమైందని ఇటీవల ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన నివేదికను ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు.

అంత్యోదయ స్ఫూర్తితో సమగ్ర అభివృద్ధి

స్వాతంత్ర్యం వచ్చిన ఆరు దశాబ్దాల పాటు పేదరిక నిర్మూలన ఒక నెరవేరని కలగానే మిగిలిపోయిందని, గత ప్రభుత్వాలు కేవలం తాత్కాలిక ఉపశమనాలపైనే దృష్టి సారించాయని నిర్మలా సీతారామన్ విమర్శించారు. అయితే, మోడీ ప్రభుత్వం 'అంత్యోదయ' (చిట్టచివరి వ్యక్తి సంక్షేమం) స్ఫూర్తితో ఇంటింటికీ మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, పేదరికానికి కారణమయ్యే అడ్డంకులను శాశ్వతంగా తొలగించిందని తెలిపారు.

ఇంటి నుంచే ఆరోగ్యం, ఆత్మగౌరవం

స్వచ్ఛ భారత్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణంతో ఏటా సుమారు 60,000 నుంచి 70,000 శిశు మరణాలు నివారించబడ్డాయని మంత్రి పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ నల్లా కనెక్షన్లు 2019లో 3 కోట్ల నుంచి నేడు దాదాపు 16 కోట్ల ఇళ్లకు విస్తరించాయన్నారు. ఉజ్వల యోజన, పీఎం ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్ పథకాలు పేద కుటుంబాలకు ఆర్థిక భద్రతను, ఆత్మగౌరవాన్ని అందిస్తున్నాయని వివరించారు.

బ్యాంకు ఖాతా నుంచి పారిశ్రామికవేత్తల వరకు

గతంలో రూపాయి పంపితే 15 పైసలే లబ్ధిదారులకు చేరేవని, కానీ నేడు 59 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ప్రజల ఖాతాల్లోకి నిధులు చేరుతున్నాయని తెలిపారు. ముద్రా పథకం కింద 60 కోట్ల రుణ ఖాతాలు మంజూరు కాగా, అందులో మూడింట రెండొంతులు మహిళలకే దక్కాయని చెప్పారు. కరోనా సమయంలో తండ్రిని, వ్యాపారాన్ని కోల్పోయిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన సుస్మితా ఘరాయ్, ఎటువంటి పూచీకత్తు లేని ముద్రా రుణంతో ప్రింటింగ్ ప్రెస్‌ను తిరిగి ప్రారంభించి నేడు 8 మందికి ఉపాధి కల్పిస్తున్న ఉదంతాన్ని ఆమె గుర్తుచేశారు.

మహిళా శక్తితోనే మార్పు - 2047 వికసిత్ భారత్ లక్ష్యం

స్వయం సహాయక సంఘాల్లో 10 కోట్ల మంది గ్రామీణ మహిళలు భాగస్వాములయ్యారని, ఇప్పటివరకు 3.7 కోట్ల మందికి పైగా 'లఖ్‌పతి దీదీ'లుగా ఎదిగారని, కొందరు 'క్రోర్‌పతి దీదీ'లుగా, 'నమో డ్రోన్ దీదీ'లుగా మారారని నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. గతేడాది నాగాలాండ్‌లోని మారుమూల కిఫిరే జిల్లా పర్యటనలో చిరుధాన్యాల ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న 'లఖ్‌పతి దీదీ' ఎస్తేర్ ఆత్మవిశ్వాసం తనను ఎంతో ఆకట్టుకుందని తెలిపారు. 140 కోట్ల మంది భారతీయుల సంకల్పంతో 2047 నాటికి 'వికసిత్ భారత్' కల తప్పకుండా సాకారమవుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

సెక్రెటేరియట్ బాహుబలి దర్వాజలకు పగుళ్లు

మొదటి పేజీ తరువాయి

నిర్మాణ లోపం కారణంగానే సమస్యలు తలెత్తున్నాయని అనే చర్చ సెక్రెటేరియట్ ఉద్యోగవర్గాల్లో జరుగుతున్నది. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన సెక్రెటేరియట్ కోసం సుమారు రూ. 12 వందల కోట్లు ఖర్చు చేశారు. చూపరులను ఆకర్షించే విధంగా చుట్టూ గుమ్మటాలు ఏర్పాటు చేశారు. అలాగే భవనం మహాద్వారం అందరినీ అకట్టుకునే విధంగా రూపొందించారు. 29 అడుగుల వెడల్పు, 24 అడుగుల ఎత్తుతో నాలుగు తలుపులను ఏర్పాటు చేశారు. అదిలాబాద్ అడవుల్లో నాణ్యమైన టేకు కలపను సేకరించి, నాగాపూర్‌కు పంపి అక్కడ మహాద్వారాన్ని తయారు చేయించారు. ఆకర్షణగా ఉండేందుకు ఇత్తడి పోతతో నగిషీలు చెక్కించి, బంగారపు రంగు పూశారు. భారీ ఎత్తులో గంభీరంగా ఉండటంతో వాటిని అందరూ బాహుబలి దర్వాజలుగా పిలుస్తుంటారు.

తయారీలో లోపాలు

దర్వాజల తయారీ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం దర్వాజల్లో పగుళ్లు ఏర్పడుతున్నట్టు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. 29 అడుగుల వెడల్పుతో దర్వాజాలను ఏర్పాటు చేసేందుకు రెండు మూడు కలపలను కలిపి ప్రత్యేకమైన ప్రెసింగ్ సిస్టమ్ ద్వారా వాటిని అతికించారు. ప్రెసింగ్ చేసిన తరువాత కొంత కాలం వాటిని కదలించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కానీ 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నాటి ప్రభుత్వం సెక్రెటేరియట్‌ను ప్రారంభించాలని తొందరపెట్టడంతో తయారీదారులు హడావుడిగా దర్వాజల పనులను పూర్తిచేసి బిగించారు. మూడున్నరేళ్ల తరువాత దర్వాజల్లోని లోపాలు క్రమంగా బయటపడుతున్నట్టు ఇంటీరియర్ డిజైనర్లు అభిప్రాయపడుతున్నారు.

హైదరాబాద్ ఉగ్రదాడి బెదిరింపు మెయిల్ ఫేక్!

న్యూస్ డెస్క్, 23 నవంబర్ (ఇది కద నిజం): హైదరాబాద్ నగరంలో బెదిరింపు ఈ-మెయిల్ కలకలం రేపింది. నగరంలో 26/11 తరహా ఉగ్రదాడులను మళ్లీ చేస్తామంటూ ఆగంతకులు మెయిల్ పంపారు. అయితే.. బెదిరింపు ఈ-మెయిల్ ఫేక్ అని పోలీసులు నిర్ధారించారు. కాచిగూడ టూరిస్ట్ ప్లాజా, రైల్వే స్టేషన్‌ను పేల్చేస్తామని, కనీసం 300 మందిని చంపడమే లక్ష్యమని అందులో బెదిరించారు. లతీఫ్ భట్, ఇతర సహచరులను హతమార్చినందుకు ప్రతీకారంగా దాడులు చేస్తామంటూ హెచ్చరించడంతో స్పెషల్ బ్రాంచ్ నుంచి నగర పోలీసులకు ఎమర్జెన్సీ అలర్ట్ వెళ్లింది.


ALERT MESSAGE

To : All SHOs, Hyderabad City, All ACsP, Hyderabad City, All DCsP in Zones, Traffic & Taskforce Hyderabad.

Info : Jt. CsP, (L&O), North Zone and Traffic Hyderabad, Addl. CP, (L&O), South Range, Hyderabad, Addl. DGP, Int., TG, Hyderabad, Commissioner of Police, Hyderabad City.

From : Jt. CP, Special Branch, Hyderabad City.

SB (I) No. 357/52/2026 Date: 21.11.2026

SB ALERT ON TERROR THREAT TO REPEAT 26/11 MUMBAI TERROR ATTACKS IN HYDERABAD

It is to inform that, an email titled Lashkar-E-Taiba was received containing a terror threat, wherein the sender, claiming affiliation with Lashkar-E-Taiba (LeT), threatened to carry out bomb blasts at Hotel Tourist Plaza, Kachiguda and Kachiguda Railway Station, Hyderabad with an intention to kill at least 300 persons (.) The sender further threatened to replicate the 26/11 Mumbai terror attacks in Hyderabad on the same day, stating that the attacks were intended to avenge the killing of their leader, Latief Bhat, and other associates by the Indian Army (.)

In view of the specific threat to two important public locations, particularly a hotel and a major railway station, there is an immediate security concern and possibility of a threat to public life and property (.)

Hence, it is advised to remain on high alert and take immediate precautionary measures by strengthening security and surveillance at Hotel Tourist Plaza, Kachiguda and Kachiguda Railway Station, Hyderabad and also crowded public places, hotels, railway stations, bus stations, religious places and other important installations (.) Special attention shall be given to suspicious persons, unattended objects, vehicles and any unusual activities (.) Adequate patrolling, anti-sabotage checks and coordination with concerned security agencies shall be ensured (.)

Sd/-
for Jt. Commissioner of Police, Special Branch, Hyderabad.

NOG:
All Inspectors in Zones and SOC, Special Branch, Hyderabad.
All ACsP in Zones, Special Branch, Hyderabad.
Addl. DCP, SB & PA to Jt. CP, SB, Hyderabad for information.
In-charge, Control Room, SB, Hyd., to inform the concerned immediately.

భద్రతా చర్యలు.. తనిఖీలు ముమ్మరం

బెదిరింపు మెయిల్ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమై తనిఖీలు, గస్తీ పెంచారు. అనుమానిత ప్రాంతాల్లో యాంటీ-సబోటేజ్, బాంబ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించగా, నగరవ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేశారు. మరోవైపు ఈ నకిలీ బెదిరింపు మెయిల్ పంపిన ఆగంతకుల కోసం సైబర్ క్రైమ్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

వదంతులు నమ్మొద్దు.. డయల్ 112కు సమాచారం ఇవ్వండి

మెయిల్ ఫేక్ అని తేలిన నేపథ్యంలో ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని పోలీసులు కోరారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రత కోసం హైదరాబాద్ పోలీసులు 24 గంటలూ అందుబాటులో ఉన్నారని భరోసా కల్పించారు.

కృష్ణా జలాలపై చంద్రబాబుకు కవిత విజ్ఞప్తి!



న్యూస్ డెస్క్, 23 నవంబర్ (ఇది కద నిజం): కృష్ణా జలాల వివాదాన్ని అన్నదమ్ముల్లా పరిష్కరించుకోవాలని టీఆర్ఎస్ అధినేత కవిత ఏపీ సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేశారు. రాజమండ్రిలో తమ స్నేహితురాలి నివాసానికి కవిత వెళ్లారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రాలుగా విడిపోయినా ప్రజలుగా కలిసి ఉండాలని 12 ఏళ్లుగా కోరుకుంటున్నామని చెప్పారు. కృష్ణా నదిలో నీళ్లు తక్కువగా ఉన్న సమయంలో అనుమతులు లేని ప్రాజెక్టుల ద్వారా ఏపీ నీటిని తరలించుకుంటోందన్న ఆందోళన తెలంగాణలో ఉందని చెప్పారు. ఆంధ్ర నాయకులను తప్పుబట్టడం కంటే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అచేతన, నిస్సహాయ వైఖరిని ప్రజలు ప్రశ్నిస్తున్నారని అన్నారు.

చంద్రబాబు నాయుడు అన్నదమ్ముల్లా వ్యవహరించి అపెక్స్ కౌన్సిల్‌లో నీటి పంపకాల అంశాన్ని చర్చించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని చెప్పారు. ఇరు రాష్ట్రాల ప్రజల ప్రయోజనాలు, స్నేహ సంబంధాలు కాపాడుకోవాలన్నారు. సమస్యను పరిష్కరించినప్పుడే ఇరు రాష్ట్రాల ప్రజల మధ్య సామరస్యత ఉంటుందని చెప్పారు. అలా చేయకుండా కేంద్రంలో బీజేపీతో పొత్తులో ఉన్నందున తెలంగాణ హక్కులు కొల్లగొడతామంటే మళ్లీ పాత పరిస్థితులే పునావృతమవుతాయన్నారు. కాబట్టి అలా అవ్వకుండా వనరులు ఏం ఉన్నా విభజన జరగాలని, దానికోసం పెద్దలు చంద్రబాబు కృషి చేయాలన్నారు.

రాహుల్ కోసం తెలంగాణ నిధులా?

మొదటి పేజీ తరువాయి

ఎస్ఐఆర్ ప్రక్రియను అడ్డుపెట్టుకుని ఇండీ కూటమి నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. 13 కోట్ల ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ అంటున్నారని, అందులో 3 కోట్ల మంది మరణించిన వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగాలా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో లక్షలాది మందితో సహా దేశవ్యాప్తంగా 6 కోట్లకు పైగా ప్రజలు వేరే ప్రాంతాలకు బదిలీ అయ్యారని, వారికి రెండు చోట్ల ఓటు హక్కు ఉండాలా అని నిలదీశారు. 2002-03 ఓటర్ల జాబితాలో ఆచూకీ లేని 3 కోట్ల మంది చొరబాటుదారుల ఓట్ల కోసమే కాంగ్రెస్, ఇండీ కూటమి నేతలు పకాల్తా పుచ్చుకుంటున్నారని ఆయన ఆరోపించారు. రాజ్యాంగాన్ని కేవలం చేతుల్లో పట్టుకుని తిరిగే వారికి భిన్నంగా, తాము రాజ్యాంగాన్ని గుండెల్లో, మనసుల్లో పెట్టుకుని పూజిస్తామని, రాజ్యాంగ సంస్థలను గౌరవిస్తామని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలన, రాహుల్ గాంధీపై వ్యాఖ్యలు

తమ స్వార్థం, కుటుంబం, పదవి కోసం దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్ నేతలు నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరమని నితిన్ నబీన్ విమర్శించారు. రాహుల్ గాంధీ దేశంలో ఉన్నప్పుడు దేశ ప్రజలను, విదేశాలకు వెళ్లినప్పుడు భారతదేశ ప్రతిష్ఠను అవమానిస్తున్నారని ఆయన అన్నారు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ యువతకు, మహిళలకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో అత్యంత బలహీన ఆర్థిక వ్యవస్థల జాబితాలో ఉన్న భారత్, నేడు ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని నితిన్ నబీన్ పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు

తెలంగాణలో 36 నెలల పాలన పూర్తికాకముందే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 82 సార్లకు పైగా ఢిల్లీ దర్బార్‌కు వెళ్లి అధిష్ఠానానికి మోకరిల్లారని నితిన్ నబీన్ విమర్శించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు, యువతకు కాకుండా కేవలం రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలకు 'ఏటీఎం'లా పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ పేద ప్రజల శ్రమను దోచి ఢిల్లీ బాస్‌ల ఏటీఎంలను నింపుతున్నారని మండిపడ్డారు. గతంలో ఒక అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించిన ప్రజలకు, అంతకంటే పెద్ద అవినీతి ప్రభుత్వం వస్తుందని అప్పుడు తెలియదని వ్యాఖ్యానించారు. యువత, రైతులు, మహిళలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ఈ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని, 2028, 2029 ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీని ఆశీర్వదిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మోదీ నాయకత్వం, వికసిత్ భారత్ సంకల్పం

కాంగ్రెస్‌కు ఎన్నికలు, అధికారమే తెలుసని, కానీ బీజేపీకి ఎన్నికలు ప్రజలకు సేవ చేసే మార్గమని నితిన్ నబీన్ అన్నారు. గతంలో ఢిల్లీ నుండి రూపాయి పంపితే పేదలకు 15 పైసలు మాత్రమే అందేవని, కానీ మోదీ ప్రభుత్వంలో రూపాయికి రూపాయి నేరుగా పేదలకే అందుతోందని ఆయన తెలిపారు. కాంగ్రెస్ హయాంలో చివరి గ్రామాలుగా చూసిన సరిహద్దు గ్రామాలను మోదీ ప్రభుత్వం మొదటి గ్రామాలుగా అభివృద్ధి చేస్తోందని, సైనికులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని కొనియాడారు. 2029లో కూడా ప్రధాని మోదీయే ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేస్తారని, ఆయన నేతృత్వంలో 'వికసిత్ భారత్', 'నషా ముక్త్ భారత్' సాకారమవుతాయని నితిన్ నబీన్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు అధికారం కలే: భట్టి కౌంటర్!

మొదటి పేజీ తరువాయి



భట్టి ఈ సందర్భంగా రాష్ట్ర తాజా రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలపై చర్చించారు. ఈ సమావేశం అనంతరం మీడియాతో భట్టి మాట్లాడారు.

రెండోసారీ అధికారంలోకి వస్తాం

గత బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ వ్యవస్థలు దెబ్బతిన్నాయని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను భ్రష్టుపట్టించారని భట్టి విక్రమార్క ఆరోపించారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పదేళ్ల నిరంకుశ పాలనను చూశారని, ఇప్పుడు పాడైన వ్యవస్థలను సరిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూడా చూస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే ప్రజలంతా సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ చెబుతున్న నీటి లెక్కలన్నీ త్వరలోనే బయటపెడతామని హెచ్చరించారు. ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని, పేద, మధ్యతరగతి ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, దేశంలో ఎక్కడా లేనట్టుగా యంగ్ ఇండియా స్కూళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఇన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రంలో రెండోసారి కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ప్రచారాన్ని ఖండించారు. అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై వస్తున్న అవినీతి ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని, అదంతా ఊహ మాత్రమేనని కొట్టిపారేశారు.

బీజేపీ నేతల మాటలు హాస్యాస్పదం:

ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నామని బీజేపీ నేతలు చెప్పడం హాస్యాస్పదమని భట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని బలహీనపరిచేందుక

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

మంగళవారం 24-11-2026

ఎమ్మెల్సీ అభ్యర్థి కొల్లూరు ఆకాశ్‌కు మద్దతుగా

రాజేంద్రనగర్‌లో ముమ్మర ప్రచారం



ఇది కద నిజం ,రాజేంద్రనగర్,: ఉమ్మడి హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా, టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి కొల్లూరు ఆకాశ్ కి మద్దతుగా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీరుడు సర్వేష్ ముదిరాజ్, బి. ఇంద్ర మరియు పార్టీ రాష్ట్ర యువజన అధ్యక్షులు కంచర్ల శివారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 122వ డివిజన్, కిస్మత్‌పూర్ ప్రాంతంలో పట్టభద్రులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర యువజన అధ్యక్షులు కంచర్ల శివారెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి కొల్లూరు ఆకాశ్ ని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న

గొంగిడి సునీత మహేందర్ రెడ్డి





ఇది కద నిజం ,యాదగిరిగుట్ట,: కార్తీక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే మరియు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని, రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ సన్నిధిలోని శివకేశవుల నిలయమైన శ్రీ పార్వతివర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్ఫటిక లింగానికి శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేరు మీద ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన అరిష్టం తొలగిపోయి, కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



ఇది కద నిజం : ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వద్ద నుండి మొత్తం 137 అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అందిన దరఖాస్తులలో రెవెన్యూ శాఖకు 57, గ్రామీణ అభివృద్ధికి 25, మున్సిపాలిటీకి 16, మండల పరిషత్‌కు 13, సర్వే అండ్ ల్యాండ్స్‌కు 6, సంక్షేమ శాఖకు 4, చేనేత మరియు జౌళి శాఖకు 3, పంచాయతీ రాజ్‌కు 3, మైన్స్ శాఖకు 2 చొప్పున రాగా; ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, విద్య, ఉపాధి కల్పన, వ్యవసాయ, ఆర్ అండ్ బి, హౌసింగ్ మరియు TGSWREI శాఖలకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సీఈఓ శోభారాణి, హౌసింగ్ పీడీ అలివేలు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉదయం 5 గంటల నుంచే సత్యనారాయణ స్వామి వ్రతాలు



ఇది కద నిజం ,యాదగిరిగుట్ట: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం (నవంబర్ 24) యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో ఉదయం 5 గంటల నుంచే శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు ప్రారంభం కానున్నాయి. గత ఏడాది పౌర్ణమి రద్దీతో పాటు, ప్రస్తుత కార్తీక మాసంలోని వారాంతాల్లో భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు ముందస్తుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు వ్రతాలు ఆచరించే అవకాశం ఉన్నందున, ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్రమబద్ధంగా పూజలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా వ్రతాలకు అవసరమైన పూజా సామాగ్రిని ముందుగానే సిద్ధం చేయించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి వ్రత మండపాన్ని, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను స్వయంగా పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులందరూ వ్రతాలు ఆచరించి, మొక్కులు చెల్లించుకొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని దేవస్థానం కోరింది.

ఆలేరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి మంత్రులకు ఆహ్వానం



ఇది కద నిజం :ఈ నెల 27న ఆలేరు పట్టణంలో జరిగే మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరుకావాలని మంత్రులకు ఆహ్వానం పలికిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, నూతన చైర్మన్ సుదగాని మల్లేష్ గౌడ్. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య తో పాటు నూతనంగా నియమితులైన ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుదగాని మల్లేష్ గౌడ్ పలువురు రాష్ట్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 27వ తేదీన ఆలేరు పట్టణంలో నిర్వహించనున్న ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరుకావాలని మంత్రులను



ఆహ్వానించారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ని, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ,తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి సందీప్ కుమార్ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి లక్ష్యంగా నూతన మార్కెట్ కమిటీ పనిచేయాలని ఆకాంక్షించారు. మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల నియామకంతో రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారం, పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు, మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు రైతులకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా మార్కెట్ కమిటీ పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. మంత్రులు కూడా ఈ ఆహ్వానంపై సానుకూలంగా స్పందిస్తూ ఈ నెల 27వ తేదీన ఆలేరు పట్టణంలో నిర్వహించనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతామని తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, రైతులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులకు సామాజిక అంశాలపై పోలీసుల అవగాహన కార్యక్రమం

యువత పెడదారి పట్టకుండా జాగ్రత్తలు పాటించాలి- పోలీసుల సూచన



పాత బాన్సువాడ, ఇది కద నిజం:కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు, బాన్సువాడ ఇన్‌స్పెక్టర్ తులా శ్రీధర్ ఆధ్వర్యంలో పాత బాన్సువాడ జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



యువత పెడదారి పట్టకుండా ఉండటం, ప్రేమ పేరుతో జరిగే మోసాలు, మైనర్ల డ్రైవింగ్, మాదక ద్రవ్యాల నిర్మూలన, సైబర్ నేరాలు, మైనర్లపై జరిగే నేరాలు, వాటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను జాగ్రత్తగా వినియోగించాలని, మంచి లక్ష్యంతో చదువుపై దృష్టి పెట్టాలని పోలీసులు సూచించారు. చిన్న పొరపాటు కూడా భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని, ఇతరులను గుడ్డిగా నమ్మి మోసపోవద్దని తెలిపారు. మూఢనమ్మకాలకు దూరంగా ఉంటూ శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంపై విశ్వాసం పెంచుకోవాలని, ఎలాంటి చిన్న నేరానికీ పాల్పడవద్దని హితవు పలికారు.

పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ యు. శేషారావు, పోలీస్ కానిస్టేబుల్ ప్రభాకర్ మాటలు, పాటల ద్వారా విద్యార్థులకు సందేశాన్ని అందించారు. బాన్సువాడ షీ టీమ్ పనితీరు, మహిళల రక్షణ కోసం చేపడుతున్న చర్యలు, పోక్సో చట్టం, మైనర్లకు సంబంధించిన నేరాలపై పోలీస్ కానిస్టేబుల్ అనిల్, మహిళా పోలీస్ కానిస్టేబుల్ పార్వతి వివరించారు.

అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930కు, మాదక ద్రవ్యాల సంబంధిత సమాచారం కోసం 1908కు, మహిళల రక్షణకు సంబంధించిన సహాయం కోసం షీ టీమ్ నంబర్ 8712686094కు సంప్రదించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రొబేషనరీ డీఎస్పీలకు ఎస్పీ దిశానిర్దేశం

ఆరు నెలల ప్రాక్టికల్ శిక్షణను సద్వినియోగం చేసుకొని విధులపై పూర్తి పట్టు సాధించాలి

ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేలా ప్రతి అంశంపై సమగ్ర అవగాహన పెంచుకోవాలి- ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి,ఇది కద నిజం : పది నెలల ప్రాథమిక శిక్షణను పూర్తి చేసుకొని, ఆరు నెలల ప్రాక్టికల్ శిక్షణ నిమిత్తం సంగారెడ్డి జిల్లాకు వచ్చిన నలుగురు ప్రొబేషనరీ డీఎస్పీలకు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ దిశానిర్దేశం చేశారు. ప్రొబేషనరీ డీఎస్పీలు మహేందర్, ప్రమోద్, ప్రతిభ, మహేశ్వరికి శిక్షణ కాలంలో నేర్చుకోవాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆరు నెలల ప్రాక్టికల్ శిక్షణలో పోలీసు శాఖకు సంబంధించిన అన్ని విభాగాలు, విధులు, బాధ్యతలపై క్షుణ్ణంగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ శిక్షణ సమయంలో నేర్చుకునే అంశాలు భవిష్యత్తులో వారి పోలీసు సర్వీసుకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.ముఖ్యంగా న్యాయస్థానాలకు సంబంధించిన విధులు, వరకట్న మరణాలు, ట్రాఫిక్ నిర్వహణ వంటి తీవ్రమైన కేసుల దర్యాప్తు విధానాలపై పూర్తి అవగాహన సాధించాలని సూచించారు. కేసుల నమోదు నుంచి నేర నిరూపణ వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసు శాఖ పరిపాలనా వ్యవహారాలపై పట్టు సాధించాలన్నారు.ప్రతి కేసు దర్యాప్తు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలిస్తూ సీనియర్ అధికారుల అనుభవాలను తెలుసుకోవాలని, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించడం ద్వారా వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.భవిష్యత్తులో సమర్థవంతమైన పోలీసు అధికారులుగా ఎదిగి ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు ఈ ఆరు నెలల ప్రాక్టికల్ శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రొబేషనరీ డీఎస్పీలకు సూచించారు.

రాజ్యాంగ దినోత్సవ సదస్సును జయప్రదం చేయండి

బహుజనుల స్థితిగతులపై చర్చకు మేధావులు, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరుకావాలి

డిజెఎఫ్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు ముక్కగల్ల యాదన్న



సంగారెడ్డి జిల్లా, ఇది కద నిజం: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో నిర్వహించనున్న సామాజిక సదస్సును జయప్రదం చేయాలని దళిత జర్నలిస్టుల ఫోరమ్ (డిజెఎఫ్) ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు ముక్కగల్ల యాదన్న పిలుపునిచ్చారు.

సోమవారం దౌల్తాబాద్‌లో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. “77 ఏళ్ల భారత రాజ్యాంగం– బహుజనుల స్థితిగతులు” అనే అంశంపై సంగారెడ్డి రోడ్డులోని ఆర్‌పీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ మాజీ జాతీయ అధ్యక్షుడు ఎస్. చంద్రయ్య, సాహసం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పారం ప్రకాష్, స్థానిక తహసీల్దార్ ఫర్వీన్ షేక్, జిన్నారం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, స్థానిక ఎస్సై శ్రీధర్ రెడ్డితో పాటు పలువురు బహుజన అభ్యుదయ మేధావులు, ప్రముఖులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

రాజ్యాంగం కల్పించిన హక్కులు, సామాజిక న్యాయం, బహుజనుల అభివృద్ధి వంటి అంశాలపై చర్చించనున్న ఈ సదస్సుకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మహిళలు, సామాజిక ప్రజాసంఘాల ప్రతినిధులు, విద్యార్థి నాయకులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ముక్కగల్ల యాదన్న విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దళిత జర్నలిస్టుల ఫోరమ్ నాయకులు కిషన్ రావు, పోచయ్య, కిష్టయ్య, పద్మారావు, మొగలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ ఇంజినీరింగ్‌పై బీఆర్ఎస్ నాయకుడి ఫిర్యాదు

18 ఎకరాలకు పైగా స్థలం కేటాయించినా ప్రారంభంకాని పరిశ్రమ పనులు

కమిషనర్‌ను కలిసిన మాచబోయిన శ్రీకాంత్



పటాన్‌చెరు, ఇది కద నిజం: జిన్నారం మండలం మంగంపేట గ్రామ శివారులో ఆజాద్ ఇంజినీరింగ్ పరిశ్రమ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మంగంపేట గ్రామ బీఆర్ఎస్ నాయకుడు మాచబోయిన శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిన్నారం మున్సిపల్ కమిషనర్‌కు పరిశ్రమ యాజమాన్యంపై ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. మంగంపేట గ్రామ శివారులోని సర్వే నంబర్ 55లో 2022లో ఆజాద్ ఇంజినీరింగ్ పరిశ్రమ ఏర్పాటుకు 18 ఎకరాలకు పైగా స్థలాన్ని కేటాయించారని తెలిపారు. స్థలం చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేసిన యాజమాన్యం ఇప్పటివరకు పరిశ్రమ నిర్మాణ పనులను ప్రారంభించకపోవడం విచారకరమన్నారు.

పరిశ్రమ ఏర్పాటు ద్వారా గ్రామంలోని చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులతో పాటు మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని గ్రామస్తులు ఆశించారని పేర్కొన్నారు. అయితే సంవత్సరాలు గడుస్తున్నా పనులు ప్రారంభం కాకపోవడంతో గ్రామ అభివృద్ధిపై పెట్టుకున్న ఆశలు నిరాశలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని, పరిశ్రమ నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమ ఏర్పాటుతో మంగంపేట గ్రామానికి ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు సమగ్ర అభివృద్ధికి మార్గం సుగమమవుతుందని మాచబోయిన శ్రీకాంత్ ఆశాభావం వ్యక్తం చేశారు.

గురుకుల సమస్యల పరిష్కారం కోసం టి జి పి ఏ నిరంతర పోరాటం

పని చేసే వారిని విమర్శించకుండా సహకరించండి

అందరి పిల్లల భవిష్యత్తు కోసమే మా ప్రయత్నం

టి జి పి ఏ కామారెడ్డి జిల్లా కమిటీ విజ్ఞప్తి



కామారెడ్డి, ఇది కద నిజం: తెలంగాణ సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల, మైనారిటీ, ఎస్టి గురుకుల పాఠశాలల్లో ఇటీవల కాలంలో ఎదురవుతున్న అనేక సమస్యల పరిష్కారం కోసం జిల్లా కమిటీ నిరంతరం పోరాటం చేస్తోందని టి జి పి ఏ కామారెడ్డి జిల్లా కమిటీ తెలిపింది. అయితే కమిటీ చేస్తున్న ప్రయత్నాలు, పేరెంట్స్ చేపడుతున్న కార్యక్రమాలు గ్రూపులోని ప్రతి ఒక్కరికీ తెలియకపోవచ్చని పేర్కొంది.సోషల్ మీడియా గ్రూపులో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేవారికి గురుకులాల్లో తలెత్తుతున్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం జిల్లా కమిటీ చేస్తున్న కృషి గురించి కొంతవరకు అవగాహన ఉంటుందని తెలిపింది. అప్పుడప్పుడు మాత్రమే గ్రూపులోకి వచ్చేవారికి ఈ విషయాలు పూర్తిగా తెలియకపోవచ్చని పేర్కొంది.సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారి కృషిని గుర్తించాలని, ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా పనిచేసే వారిపై అనవసర విమర్శలు చేయవద్దని కమిటీ విజ్ఞప్తి చేసింది. పేరెంట్స్‌గా తమ బాధ్యతను గుర్తించి, పిల్లల భవిష్యత్తు కోసం సమయం, శ్రమ వెచ్చిస్తూ పనిచేస్తున్నామని స్పష్టం చేసింది.

“మేము టైం, టాలెంట్, ట్రెజరీ” అనే నినాదంతో పనిచేస్తున్నాం. మాకు ఎలాంటి జీతాలు రావడం లేదు. అందరి పిల్లల సంక్షేమం కోసం స్వచ్ఛందంగా కృషి చేస్తున్నాం. కాబట్టి పనిచేసే వారికి అండగా నిలవండి. విమర్శలు చేయడం కంటే సమస్యల పరిష్కారానికి సహకరించండి” అని కమిటీ కోరింది.

పనిచేసే వారిని నిరుత్సాహపరిచే విధంగా మాట్లాడితే భవిష్యత్తులో సేవ చేయడానికి ముందుకు వచ్చే వారు తగ్గిపోతారని ఆవేదన వ్యక్తం చేసింది. గురుకులాల్లోని సమస్యలు మనందరి బాధ్యతగా భావించి, వాటి పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చింది.

మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

బీజేపీ కౌన్సిలర్ కనకరాజు పిలుపు



దుబ్బాక,ఇది కద నిజం: ఈ నెల 25న బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు సిద్దిపేట పట్టణంలో నిర్వహించనున్న బీజేపీ మహా పాదయాత్రను విజయవంతం చేయాలని దుబ్బాక మున్సిపల్ 2వ వార్డు కౌన్సిలర్ కనకరాజు పిలుపునిచ్చారు.మాజీ జాతీయ అధ్యక్షుడు,కేంద్ర మంత్రి జేపీ నడ్డా హాజరవుతున్న సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆదేశాల మేరకు పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.అందరూ కలిసికట్టుగా పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
మంగళవారం 24-11-2026

సినిమా న్యూస్



విష్ణుతో ప్రభుదేవా మూవీ!

మంచు విష్ణు హీరోగా ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు ప్రభుదేవా ఓ సినిమాను తెరకెక్కించ బోతున్నారనే వార్త టాలీవుడ్‌లో ఆసక్తిని పెంచుతోంది. 'కన్నప్ప' సినిమా తర్వాత మంచు విష్ణు తన తదుపరి ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టారు. ఈ క్రమంలో ప్రభుదేవాతో ఆయన సినిమా చేయబోతున్నట్లు గతంలోనే వార్తలు వచ్చాయి. ఈ సినిమా పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనుందని సమాచారం. మాస్ యాక్షన్‌తో పాటు వినోదానికి ప్రాధాన్యత ఉంటుందని, మంచు విష్ణును గతంలో ఎన్నడూ చూడని కొత్త అవతార్‌లో ప్రభుదేవా చూపించనున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ కోసం విష్ణు ప్రత్యేకంగా తన ఫిజిక్‌పై దృష్టి పెట్టినట్లు కూడా వార్తలు వచ్చాయి. ప్రభుదేవా గతంలో తెలుగులో 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా', 'పౌర్ణమి', 'శంకర్ దాదా జిందాబాద్' వంటి సినిమాలకు దర్శకత్వం వహించారు. దాదాపు 18 ఏళ్ల తర్వాత మళ్లీ తెలుగు సినిమాకు దర్శకత్వం వహించనున్నారనే వార్త ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను పెంచుతోంది. ఈ చిత్రాన్ని మంచు విష్ణుకు చెందిన 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ నిర్మించనున్నట్లు సమాచారం. అయితే సినిమా టైటిల్, హీరోయిన్, ఇతర నటీనటులు, షూటింగ్ షెడ్యూల్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.



డబ్బింగ్‌లో బిజీగా నిఖిల్

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'స్వయంభు'. రెండు భాగాలుగా రాబోతున్నట్లు ప్రకటించిన ఈ భారీ బడ్జెట్ చిత్రం గత కొన్ని నెలలుగా వాయిదా పడుతూ వస్తోంది. అయితే, ఈ సినిమాను కచ్చితంగా ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామని నిఖిల్ ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. తాజాగా, ఈ మూవీకి సంబంధించి మరో ఆసక్తికరమైన అప్‌డేట్‌ను అభిమానులతో పంచుకున్నారు. నిఖిల్ తన సోషల్ మీడియా వేదికగా డబ్బింగ్ సెషన్‌కు సంబంధించిన ఒక ఫోటోను షేర్ చేశారు. గత రెండు వారాలుగా తాను 'స్వయంభు' డబ్బింగ్ పనుల్లోనే నిమగ్నమై ఉన్నానని వెల్లడించారు. సినిమా అవుట్‌పుట్ విషయంలో ఎక్కడా తగ్గకుండా, అత్యంత పరిపూర్ణతతో డబ్బింగ్ పూర్తి చేయడంపై పూర్తిగా దృష్టి పెట్టినట్లు తెలిపారు.

నిఖిల్ డెడికేషన్ చూస్తుంటే ప్రేక్షకుల్లో సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. కాగా.. ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ ఈ సినిమాను భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. కేజీఎఫ్, సలార్ ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా, బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్ కుమార్ ఈ చిత్రానికి పనిచేయడం విశేషం. ఇండియన్ భాషలతో పాటు అంతర్జాతీయ భాషలు కలుపుకుని మొత్తం ఎనిమిది భాషల్లో 'స్వయంభు' చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



కిరణ్ అబ్బవరం కొత్త 'రికార్డ్'!

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన నటించిన 'రియాలిటీ' సినిమా విడుదలకు సిద్ధమవుతుండగా, తాజాగా తన తదుపరి చిత్రాన్ని ప్రకటించారు. కిరణ్ అబ్బవరం కెరీర్‌లో 14వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'రికార్డ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేయడంతో సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ లుక్ పోస్టర్‌లో స్మార్ట్‌ఫోన్‌ను చూపించి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ క్రియేట్ చేశారు. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్‌లో రక్తం రంగులో కనిపిస్తున్న ఎర్రటి పౌర్ణమి నేపథ్యంలో ఓ గుర్రం కనిపిస్తోంది. ఈ పోస్టర్ చూస్తుంటే సినిమా ఏదో విభిన్నమైన కథాంశంతో తెరకెక్కనున్నట్లు అనిపిస్తోంది. అయితే కథ, పాత్రలు, జానర్‌కు సంబంధించిన వివరాలను మేకర్స్ ఇంకా వెల్లడించలేదు.

ఈ చిత్రానికి సంబంధించి నేడు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. కిరణ్ అబ్బవరం గత సినిమాలకు భిన్నంగా ఈ ప్రాజెక్ట్ ఉండబోతుందా? అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. 'రికార్డ్' సినిమాను వంశీ నందిపాటి, అశోక్ బండ్రెడ్డి నిర్మిస్తున్నారు. వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, సుకుమార్ రైటింగ్స్, థీ స్టోరీస్ బ్యానర్లపై ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వీర కొగటం దర్శకత్వం వహిస్తున్నారు. సినిమాటోగ్రఫీ బాధ్యతలను మనోజ్ రెడ్డి నిర్వహిస్తుండగా, సంగీతాన్ని జస్టిన్ ప్రభాకరన్ అందిస్తున్నారు.

ప్రస్తుతం విడుదలకు సిద్ధమవుతున్న 'రియాలిటీ'తో పాటు కొత్త సినిమా 'రికార్డ్' ప్రకటనతో కిరణ్ అబ్బవరం అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఫస్ట్ లుక్‌లో కనిపిస్తున్న విజువల్స్, టైటిల్ వెనుక ఉన్న అర్థం, సినిమా కథ ఎలా ఉండబోతుందనే విషయాలు తెలియాలంటే మరిన్ని అప్డేట్స్ కోసం ఎదురుచూడాల్సిందే.



రక్తసంబంధాల రణరంగం

శర్వానంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో రాబోతున్న భోగి సినిమా ట్రైలర్‌ను చిత్రయూనిట్ విడుదల చేసింది. చిత్రంలో డింపుల్ హయాతి, అనుపమ పరమేశ్వరన్ హీరయిన్ లుగా నటించారు. కేకే రాధామోహన్ శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. నవంబర్ 27న ఈ సినిమాను విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఇక ఈ సినిమాలో గతంలో ఎన్నడూ చేయని పాత్రలో శర్వానంద్ నటించాడు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సినిమాను తెరకెక్కించారు. అంతేకాకుండా ట్రైలర్ లో యాక్షన్ తో పాటు, ఎమోషన్స్ ను ఎక్కువగా చూపించారు. ఇందులో శర్వానంద్‌కు ఐదుగురు చెల్లెల్లు ఉండటంతో అన్నాచెల్లెల్ల సెంటిమెంట్ నేపథ్యంలో కథ ఉండబోతున్నట్టు కనిపిస్తోంది. మరి ఈ సినిమా ఎలా ఉంటుందో చూడాలంటే నవంబర్ 27 వరకు వెయిట్ చేయాల్సిందే.

టీజర్ లేదు డైరెక్ట్ ట్రైలరే

టాలీవుడ్ యంగ్ హీరో నితిన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'అలియాస్ రుక్మిణి' ప్రమోషన్స్‌లో మేకర్స్ స్పీడ్ పెంచారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచగా.. తాజాగా మరో క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. టీజర్ లేకుండానే నేరుగా ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు చిన్న వీడియో క్లిప్ రిలీజ్ చేస్తూ నవంబర్ 26న ట్రైలర్ రిలీజ్ కాబోతున్నట్లు ప్రకటించారు. ఈ సినిమాను నేచురల్ స్టార్ నాని సమర్పిస్తుండగా.. 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ రచించి, దర్శకత్వం వహిస్తున్నారు. దీప్తి గంటా యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇందులో నితిన్ సరసన ఆఫియా సయ్యద్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సాయి కుమార్, హర్షవర్ధన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ ఎంతగానో ఆకట్టుకోగా.. భారీ అంచనాలు డిసెంబర్ 4న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు.



వంద కోట్ల క్లబ్‌లో 'ఓం'!



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, టాలెంటెడ్ డైరెక్టర్ రాజ్ కుమార్ పెరియసామి కాంబినేషన్‌లో వచ్చిన తాజా చిత్రం 'ఓం' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. భారీ అంచనాల మధ్య నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైన ఈ సినిమా మొదటి నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుని, కేవలం మూడు రోజుల్లోనే రూ.100 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. ఈ అద్భుతమైన విజయాన్ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా ఇప్పటివరకు రూ.101 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టినట్లు మేకర్స్ వెల్లడించారు. దీంతో ధనుష్ కెరీర్‌లోనే అత్యంత వేగంగా వంద కోట్ల మార్కును అందుకున్న సినిమాగా 'ఓం' సరికొత్త రికార్డును నెలకొల్పింది.

ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో ఉత్కంఠభరితంగా సాగే ఈ యాక్షన్ థ్రిల్లర్ కథాంశం ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఇందులో ధనుష్ తన పవర్‌ఫుల్ నటనతో మరోసారి మాయ చేయగా, మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి ఒక కీలకమైన, శక్తివంతమైన పాత్రలో కనిపించి సినిమాకు హైలెట్‌గా నిలిచారు. ఇక హీరోయిన్లుగా సాయి పల్లవి, శ్రీలీల తమ నటన, గ్లామర్‌తో ఆకట్టుకుని సినిమా విజయంలో కీలక పాత్ర పోషించారు. వండర్ బార్ ఫిల్మ్స్, ఆర్ టేక్ స్టూడియోస్ బ్యానర్లపై ధనుష్, శ్రద్ధా అగర్వాల్, అజ్మత్ జగ్మగ్ కలిసి ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా భారీ స్థాయిలో నిర్మించారు. యువ సంగీత సంచలనం సాయి అభ్యంకర్ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ థియేటర్లలో ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి.